స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించండి

ఉండి: ఉండిలో ఎన్నో సంవత్సరాలుగా రహదారిని ఆనుకుని ఇళ్లు, దుకాణాలు నిర్మించినవారు స్వచ్ఛందంగా తొలగించుకుని తమకు సహకరించాలని ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు ఆదేశాల మేరకు ఉండి పంచాయతీ కార్యదర్శి కేశిరెడ్డి గోపాలకృష్ణ ఆక్రమణదారులకు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉండి మెయిన్ సెంటర్ నుండి రామాపురం వరకూ కొంతమంది ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని ఉండి, పాములపర్రు పంట కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు, మరుగుదొడ్ల పైపులు వదిలేయడంతో నీటి కాలుష్యం విపరీతంగా పెరిగిపోంది. దీంతో పాములపర్రు కోలమూరు తదితర గ్రామాల ప్రజలు విషయాన్ని ఎంఎల్ఎ రఘురామ కృష్ణంరాజు దృష్టికి తీసుకెళ్లారని స్పందించిన ఎంఎల్ఎ ప్రజల ఆరోగ్యానికి ఇబ్బందులు తెచ్చేవారు ఎవరైనా ఉపేక్షించేది లేదన్నారు. ఆక్రమణలను వెంటనే తొలగించాలని తమను ఆదేశించారని ఆయన తెలిపారు. ఈ మేరకు ఆక్రమణదారులకు నోటీసులిచ్చామని తెలిపారు. స్వచ్ఛందంగా వారు తమకు సహకరించాలని లేనిపక్షంలో పోలీసు యంత్రాంగం సహకారంతో జెసిబిలతో తొలగిస్తామని హెచ్చరించారు.

'అన్నదాత సుఖీభవ' అందేదెప్పుడో..!

ఖరీఫ్ పెట్టుబడుల కోసం రైతాంగం అవస్థలు

ఏడాదికి రూ.20 వేలు అందిస్తామని టిడిపి కూటమి హామీ

నేటికీ విధివిధానాలపై ప్రకటన చేయని పరిస్థితి

ఎన్ని విడతలుగా ఇస్తారో తెలియక గందరగోళం

గత ప్రభుత్వంలో రెండు జిల్లాల్లో దాదాపు 2.50 లక్షల మందికి రైతుభరోసా

ఈసారైనా కౌలురైతులకు ప్రభుత్వ సాయం అందేనా?

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండు నెలలు గడిచిపోయింది. రైతులకు పెట్టుబడి సాయం కింద ఇస్తామన్న రూ.20 వేల హామీపై సర్కార్ నోరు మెదపడం లేదు. విధివిధానాలు సైతం ఖరారు చేయలేదు. దీంతో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం ప్రకటించిన 'అన్నదాత సుఖీభవ' అందేనా అనే అనుమానం రైతుల్లో నెలకొంది. ఇప్పటికే వరదలకు తీవ్ర నష్టాలను చవిచూసిన రైతులు ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారు. రెండు జిల్లాల్లో అత్యధికంగా కౌలురైతులు ఉండటంతో ఈ ప్రభుత్వంలోనైనా వారికి పెట్టుబడి సాయం అందేనా అనే చర్చ సాగుతోంది.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గత ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద రైతులకు రైతుభరోసా పేరిట ఏడాదికి రూ.13,500 అందించింది. దీనిలో రూ.ఆరు వేలు కేంద్రం, రూ.7,500 రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చింది. కేంద్రం సొమ్ము ఏడాదిలో మూడు విడతలుగా జమైతే, రాష్ట్రప్రభుత్వం మే చివరి వారంలో మొదటివిడతగా రూ.5,500, రెండోవిడతగా జనవరిలో రూ.రెండు వేలు అందించేది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు 2.50 లక్షల మంది రైతులు రైతుభరోసా అందుకునేవారు. తాము అధికారంలోకి వస్తే పెట్టుబడి సాయం రూ.20 వేలకు పెంచుతామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీంతో రైతులు ఎంతగానో సంబరపడ్డారు. అధికారం చేపట్టాక 'అన్నదాత సుఖీభవ' పేరుతో పెట్టుబడి సాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఖరీఫ్ సాగు ప్రారంభమై నెలలు గడిచిపోతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు పెట్టుబడి అత్యంత అవసరం. కూటమి ప్రభుత్వం మాత్రం ఇప్పటి వరకూ పెట్టుబడి సాయం కింద అందించే రూ.20 వేలు గురించి నోరువిప్పడం లేదు. ఇప్పటి వరకూ 'అన్నదాత సుఖీభవ' అమలుకు సంబంధించిన విధివిధానాలపై ఆదేశాలు సైతం ఇవ్వలేదు. అందించే రూ.20 వేలు పెట్టుబడి సాయం ఎన్నివిడతలుగా ఇస్తారో కూడా తెలని పరిస్థితి. దీంతో పెట్టుబడి సాయంపై రెండు జిల్లాల రైతాంగంలో పెద్దఎత్తున చర్చ సాగుతోంది. ఇటీవల విరుచుకుపడిన వరదలు, భారీ వర్షాలకు ఖరీఫ్ పంట దెబ్బతింది. రెండు జిల్లాల్లో 30 వేలకుపైగా నాట్లు నాటిన పొలాలు, దాదాపు 1600 ఎకరాల్లో నారుమడులు దెబ్బతిన్నాయి. రైతులు ఎకరాకు రూ.15 వేలు వరకూ నష్టపోయారు. రైతులు రెండోసారి నారుమడులు, నాట్లు వేయాల్సిన పరిస్థితి. దీంతో పెట్టుబడి అదనంగా వెచ్చించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. నాట్లు వేసి 30 రోజులు పూర్తి కాలేదనే కారణంతో నష్టపరిహారం జాబితాలో దెబ్బతిన్న పంటలను చేర్చని పరిస్థితి ఉంది. రెండుసార్లు పెట్టుబడి పెట్టాల్సి రావడంతో రైతులు ఆర్థికంగా నలిగిపోతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయం వెంటనే అందిస్తే రైతులకు ఎంతగానో మేలు జరుగుతోంది. దీనిపై ప్రభుత్వం నోరుమెదపకపోవడంతో ఖరీఫ్ సీజన్‌లో 'అన్నదాత సుఖీభవ' ఇచ్చే ఉద్దేశం ప్రభుత్వానికి ఉందా అనే అనుమానాలు నెలకొన్నాయి.

కౌలురైతులకు పెట్టుబడి సాయం అందేనా..?

రెండు జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది కౌలురైతులు ఉన్నారు. జిల్లా వ్యవసాయ సాగులో 70 శాతానికిపైగా వీరే చేస్తున్నారు. గత ప్రభుత్వం రైతుభరోసా భూయజమానులకు తప్ప కౌలురైతులకు అందించలేదు. దీంతో కౌలురైతులు తీవ్రంగా నష్టపోయారు. పెట్టుబడి సాయం అనేది పెట్టుబడి పెట్టిన రైతులకు అందించాలి. సాగు చేస్తున్న కౌలురైతులు పెట్టుబడి పెడుతుండగా, ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం మాత్రం భూయజమానుల ఖాతాల్లో వేస్తున్నారు. దీనిపై కౌలురైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. తాము అధికారంలోకి వస్తే కౌలురైతులను ఆదుకుంటామంటూ టిడిపి కూటమి చెప్పింది. 'అన్నదాత సుఖీభవ' కింద అందించే పెట్టుబడిసాయం కౌలురైతులకు అందించాలని అంతా కోరుతున్నారు. కౌలురైతులకు పెట్టుబడి సాయం అందేవిధంగా విధివిధానాలు ప్రకటించాలని కోరుతున్నారు. ప్రభుత్వం ఏవిధంగా ముందుకు సాగుతుందో వేచిచూడాలి.

జాయింట్ కలెక్టర్‌గా రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం కలెక్టరేట్లో బాధ్యతల స్వీకరణ

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి : జెసి రాహుల్ కుమార్ రెడ్డి

జెసిగా బాధ్యతలు స్వీకరిస్తున్న రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా జాయింట్ కలెక్టర్‌గా తాటిమాకుల రాహుల్ కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. భీమవరం కలెక్టరేట్లో జిల్లా జాయింట్ కలెక్టర్‌గా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. శ్రీకాకుళం జిల్లా సీతంపేట ఐటిడిఎ నుంచి బదిలీపై జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఇక్కడకు వచ్చారు. సర్వీస్ ప్రారంభంలో అసిస్టెంట్ కలెక్టర్‌గా, పూర్వపు పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో పనిచేశారు. అనంతరం శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో సబ్ కలెక్టర్‌గా పనిచేస్తూ ఉద్యోన్నతిపై నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్‌గా వెళ్లారు. అక్కడ నుంచి ఎన్నికల అనంతరం శ్రీకాకుళం జిల్లా సీతంపేట ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారిగా బదిలీపై వెళ్లి అక్కడ రెండు నెలలు పనిచేసిన అనంతరం ఇటీవల జరిగిన ఐఎఎస్‌ల బదిలీల్లో జిల్లాకు జాయింట్ కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీచేసింది. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగాలను అగ్రగామిగా ఉంచేందుకు పక్కా ప్రణాళికతో కృషి చేస్తానన్నారు. రైతులకు ఇబ్బంది లేని విధంగా మద్దతు ధరతో ధాన్యం కొనుగోళ్లకు చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. ప్రతి రైతూ ఇ-పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రభుత్వ సహాయం అందజేయడానికి సులువుగా ఉంటుందని తెలిపారు. వ్యవసాయ అధికారులు ఇ-పంట నమోదులో వాస్తవ సాగుదారులను మాత్రమే నమోదు చేయాలని, కౌలు రైతులకు న్యాయం చేయాలనేదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఇ-పంట నమోదులో తప్పులు లేకుండా ఉండాలన్నారు, జెసిగా బాధ్యతలు చేపట్టిన రాహుల్ కుమార్‌రెడ్డికి డిఆర్ఒ జె.ఉదయభాస్కరరావు, నరసాపురం ఆర్‌డిఒ ఎం.అచ్యుత్ అంబరీష్, అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

జూనియర్ డాక్టర్ హత్యకు నిరసనగా..

నేడు వైద్య సేవలు బంద్

మాట్లాడుతున్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పశ్చిమబెంగాల్‌లోని ఆర్‌జికర్ మెడికల్ కాలేజీలో విధులు నిర్వర్తిస్తున్న జూనియర్ డాక్టర్ హత్యకు నిరసనగా ఒక రోజు వైద్య సేవలను నిలిపి వేయాలని జాతీయ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) పిలుపు నిచ్చిందని, ఈ మేరకు ఈనెల 17న ఉదయం 6 గంటల నుంచి 18వ తేదీ ఉదయం 6 గంటల వరకూ భీమవరంలోని అన్ని ఆసుపత్రుల్లో వైద్య సేవలు, లేబరేటరీ, డయాగ్నోస్టిక్ సెంటర్స్ నిలిపి వేయాలని నిర్ణయించినట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భీమవరం శాఖ అధ్యక్షులు జి.బాలకృష్ణరాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్.శంకర్ కుమార్ వర్మ, రాష్ట్ర యాక్షన్ కమిటీ సభ్యురాలు ఎంవి.స్వరాజ్యలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక ఐఎంఎ హాల్లో ప్రత్యేక సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యవసర వైద్య సేవల కొనసాగింపునకు మినహాయింపు ఇచ్చినట్లు చెప్పారు. మృతి చెందిన జూనియర్ డాక్టర్ కుటుంబానికి ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని, డాక్టర్లపై హింసకు వ్యతిరేకంగా రూపొందించిన చట్టాన్ని కేంద్రం పకడ్బంధీగా అమలు చేయాలని, ఆసుపత్రులను సేఫ్ జోన్లుగా ప్రకటించాలన్న డిమాండ్లతో తాము ఒక్క రోజు నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ స్పందనను బట్టి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. వైద్య వృత్తిలో పెట్రేగుతున్న హింస, దాడులను అరికట్టేందుకు వైద్యులందరూ స్వచ్ఛందంగా నిరసన కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని వారు కోరారు. కార్యక్రమంలో ట్రెజరర్ బాలమురళీ కృష్ణ, డాక్టర్ జి.సూర్యనారాయణ రాజు, డాక్టర్ ఇర్రింకి లక్ష్మి, జాయింట్ సెక్రటరీ జి.సుభాష్, డాక్టర్ ఇర్రింకి సూర్యనారాయణ రావు పాల్గొన్నారు.

నరసాపురం : కలకత్తాలో ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్యకు నిరసనగా ఈ నెల 17న ఉదయం 6 నుంచి 18న ఉదయం 6 గంటల వరకూ నరసాపురంలో ఆసుపత్రిలో వైద్య సేవలు నిలిపివేస్తున్నట్లు నరసాపురం ఇండియన్ మెడికల్ అసోషియేషన్ సభ్యులు, వైద్యులు బళ్ల మురళి తెలిపారు. శనివారం ఉదయం 9 గంటలకు గాంధీ బొమ్మ సెంటర్ నుండి అంబేద్కర్ సెంటర్ వరకూ వైద్యులు నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌డిఒకు వినతిపత్రం అందిస్తామని తెలిపారు.

మొగల్తూరు : కలకత్తా వైద్యురాలిపై జరిగిన దాడికి నిరసనగా వైద్యులు చేపట్టిన బంద్‌కు తాము మద్దతిస్తున్నామని పిఎంపి అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కెఎస్‌పిఎన్.ముక్తేశ్వరరావు సిహెచ్‌పి శ్రీనివాస్ ప్రసాద్ ప్రకటనలో తెలిపారు. వైద్యులపై దాడులు జరగకుండా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరారు.

పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్లు

జిల్లాలో అన్న క్యాంటీన్లు ప్రారంభించిన మంత్రి నిమ్మల, ఎంఎల్‌ఎలు, కలెక్టర్

పాలకొలులో అన్నా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు

చరిత్రలో ముషారఫ్, హిట్లర్ కూడా జగన్ అంత దారుణంగా నియంత పాలన చేయలేదని, అందుకే ప్రజలు జగన్‌ను 11 సీట్లకే పరిమితం చేశారని, జిల్లాలోని పేదవారి ఆకలి తీర్చేందుకు అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. శుక్రవారం తెల్లవారుజామున పాలకొల్లులో అన్నా క్యాంటీన్‌ను మంత్రి పున్ణప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నా క్యాంటీన్‌లను జగన్ పాలనలో ధ్వంసం చేశారని, అందుకే ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారని అన్నారు. భవన, ఆటో కార్మికులు అన్నాక్యాంటీన్ వంటి చోట కడుపునిండా భోజనం చేయకూడదని జగన్ భావించి వాటిని మూసివేశారని తెలిపారు. పట్టణాలకు వచ్చే పేదలు తక్కువ ఖర్చుతో ఆధునిక భవంతుల్లో మంచి భోజనం చేయాలనే సదుద్దేశంతో టిడిపి అన్నాక్యాంటీన్లు నెలకొల్పినట్లు చెప్పారు. పాలకొల్లులో అన్నా క్యాంటీన్లు మూసి ఐదేళ్లు అయినా దాతల సహకారంతో ఇప్పటి వరకూ నడిపామని, ఇక ముందు కూడా ప్రభుత్వ ఆసుపత్రిలో పేదల కోసం నడుపుతామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విజయసారధి, టిడిపి, బిజెపి, జనసేన నేతలు పాల్గొన్నారు.

భీమవరం : జిల్లాలోని పేదవారి ఆకలి తీర్చేందుకు అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం స్థానిక పాత బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలోని ఎనిమిది ప్రాంతాల్లో అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మూడు క్యాంటీన్లను భీమవరం పట్టణంలో ఏర్పాటు చేసి ప్రారంభించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పేదలు ఆకలితో ఉండకూడదనే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్నా క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు ప్రాంతాలకు పేదలు వైద్యం, విద్య వంటి పనుల కోసం వస్తుంటారని, వారు ఎక్కువ ఖర్చు పెట్టి ఆహారం కొనలేక ఇబ్బంది పడే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ఎంఎల్ఎ రామాంజనేయులు మాట్లాడుతూ సామాన్యులందరికీ రూ.5లకే ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం అన్నా క్యాంటీన్లలో అందించడం జరుగుతోందని తెలిపారు. పేదలకు కడుపునిండా భోజనం పెట్టే ఈ గొప్ప కార్యక్రమాన్ని ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం కలెక్టర్ నాగరాణి, ఎంఎల్ఎ అంజిబాబు, మాజీ రాజ్యసభ సభ్యురాలు సీతారామలక్ష్మి ప్రజలకు అల్పాహారం వడ్డించి వారితో కలిసి ఆహార పదార్థాలను రుచి చూశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, టిడిపి జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, జనసేన జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు, నాయకులు మెంటే పార్థసారధి, కోళ్ల నాగేశ్వరరావు, చెనమల్ల చంద్రశేఖర్, వబిలిశెట్టి రామకృష్ణ, పొత్తూరి బాపిరాజు, గాదిరాజు తాతారాజు, ఎద్దు ఏసుపాదం, గంటా త్రిమూర్తులు, విజ్జురోతి రాఘవులు, కారుమూరి సత్యనారాయణ మూర్తి, ముచ్చకర్ల శివ, లంకి చిన్ని పాల్గొన్నారు.

భీమవరం : అన్నా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ, కలెక్టర్

కార్యక్రమంలో టిడిపి ఇన్‌ఛార్జి వలవల బాబ్జి, మండల అధ్యక్షులు పరిమి రవికుమార్ పాల్గొన్నారు.

తణుకు : పేదవాడికి పట్టెడన్నం పెట్టాలన్న ఎన్‌టిఆర్ స్ఫూర్తితోనే అన్నా క్యాంటీన్లు పున్ణప్రారంభిస్తున్నట్లు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. తణుకు సొసైటీ రోడ్డులో ఆధునికీకరించిన భవనంలో అన్నాక్యాంటీన్ ప్రారంభించారు. అల్పాహారంతో ప్రారంభమైన క్యాంటీన్లో ప్రతిరోజూ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, సాయంత్రం భోజనం అందించనున్నారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ పేదవాడి ఆకలి తీర్చడానికి నందమూరి తారక రామారావు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారన్నారు. గత వైసిపి ప్రభుత్వం అన్నా క్యాంటీన్లు మూసివేసి పేదవాడి కడుపు కొట్టిందని విమర్శించారు. రాబోయే రోజుల్లో అత్తిలి, వేల్పూరు గ్రామాల్లో కూడా ప్రారంభిస్తామని తెలిపారు. గత పాలకుల దుర్మార్గపు ఆలోచనలతో మూసివేసిన అన్నా క్యాంటీన్లను తణుకులో 450 రోజులకుపైగా, అత్తిలిలో 550 రోజులకు పైగా దాతల సహకారంతో వాటిని దిగ్విజయంగా కొనసాగించిన అత్తిలి మండల అధ్యక్షులు ఆదినారాయణ, తణుకు పట్టణ ప్రధాన కార్యదర్శి ఒమ్మి రాంబాబు, భీమనాదం వెంకట సుబ్బారావు, పచ్చిపాల కృష్ణమూర్తిను సత్కరించారు. అనంతరం పేదలతో కలిసి టిఫిన్ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వాధికారులు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : అన్నా క్యాంటీన్లపై విమర్శలు చేస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, మంత్రులు అంబటి రాంబాబు ఒకసారి అన్నా కాంటీన్‌కు వచ్చి భోజనం చేయాలని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్థానిక తాలూకాఫీస్ సెంటర్, బలుసులమ్మ గుడి, కాపు కళ్యాణ మండపం ఎదురుగా ఉన్న మూడు అన్నా క్యాంటీన్లను ఆయన శుక్రవారం ప్రారంభి మాట్లాడారు. తాడేపల్లిగూడెంలోని మూడు అన్నా క్యాంటీన్లలో 1050 మందికి అల్పాహారంతో పాటు మధ్యాహ్నం, సాయంత్రం భోజనం కూడా అందించేందుకు అన్ని ప్రక్రియలూ పూర్తయ్యాయని తెలిపారు. తన పుట్టినరోజు సందర్భంగా ఒక పూట క్యాంటీన్ కయ్యే 10,500 రూపాయలను ఆయన మున్సిపల్ కమిషనర్‌కు అందించినట్లు తెలిపారు.



తాడేపల్లిగూడెంలో అన్నా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

భీమవరంలో అన్నా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ ఆరిమిల్లి

అన్నదాతలను ఆదుకోండి

సిపిఎం జిల్లా నాయకులు జుత్తిగ నరసింహమూర్తి

మాట్లాడుతున్న నరసింహమూర్తి

ప్రజాశక్తి - వీరవాసరం

గత ప్రభుత్వ విధానాలు, అధికారుల నిర్లక్ష్యం వల్ల పంట, మురుగు కాలువలకు మరమ్మతులు చేయకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు నష్టపోయారని సిపిఎం జిల్లా నాయకులు జుత్తిగ నరసింహమూర్తి విమర్శించారు. సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశం లింగం సత్యనారాయణ అధ్యక్షతన స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న నరసింహమూర్తి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వంపై అన్నదాతలు, ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని తెలిపారు. పంటలు పండించేది 90 శాతం మంది కౌలు రైతులేనని తెలిపారు. కోట్లాది మందికి తిండి పెట్టే అన్నదాతలు పంటలు పండించాలంటే మురుగు, పంట కాలువలు ప్రక్షాళన చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. భూయజమాని సంతకం లేకపోయినా గ్రామ సభల్లో పరిశీలించి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి ఆదుకోవాలన్నారు. అన్నదాతలకు ట్రాక్టర్లు, బరకాలు తదితర యంత్ర పరికరాలు వ్యక్తిగత సబ్సిడీపై ఇచ్చి రైతులను ప్రోత్సహించాలన్నారు. గత వైసిపి ప్రభుత్వం పెట్టిన రైతు భరోసా కేంద్రాల వల్ల రైతులకు ఒరిగిందేమీలేదని, వాటిని కూటమి ప్రభుత్వం ప్రక్షాళన చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పోతుల మృత్యుంజయ యళ్లబండి నారాయణమూర్తి బొర్ర అలమహారాజు, జుత్తిగ శ్రీనివాస్, పాల కోటేశ్వరరావు అయినంపూడి బాబూరావు, కిలాడి సత్యనారాయణ పాల్గొన్నారు.

6వ స్నాతకోత్సవానికి నిట్ ముస్తాబు

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం నిట్ 6వ స్నాతకోత్సవం ఆ ప్రాంగణంలోని రవీంద్ర కళాభారతి ఆడిటోరియంలో ఈ నెల 17వ తేదీ మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ నిర్వహించే వేడుకకు అధికారులు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు ఇన్‌ఛార్జి డైరెక్టర్ బిఎస్ఎన్.మూర్తి తెలిపారు. 2020 - 24లో బిటెక్ నాలుగేళ్ల ఇంజినీరింగ్ కోర్సును పూర్తి చేసుకున్న 527 మంది విద్యార్థులకు (బాలురు 405, బాలికలు 122) డిగ్రీలు అందజేయనున్నారు. వీరితోపాటు రెండేళ్ల ఎంటెక్ కోర్సు పూర్తి చేసిన 15 మంది విద్యార్థులకు డిగ్రీలు, 25 మంది పరిశోధనా విద్యార్థులకు డాక్టరేట్ పట్టాలను ప్రదానం చేయనున్నారు. సంస్థల్లో మొత్తం కోర్సులు నిర్వహిస్తుండగా ఆయా కోర్సుల్లో అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన ఒక్కో విద్యార్థి చొప్పున 8 మందికి, బ్యాచ్‌ల వారీగా అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థికి ఇనిస్టిట్యూట్ తరపున బంగారు పతకాలను అందజేయనున్నారు. ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ బిఎస్. మూర్తి అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమానికి హిమాచల్ ప్రదేశ్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ ఛైర్మన్, ఐఐటి అల్యూమినీ కౌన్సిల్ ప్రెసిడెంట్ డాక్టర్ రవిశర్మ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. నిట్ డైరెక్టర్ ఇనిస్టిట్యూట్ ప్రోగ్రెస్ రిపోర్ట్‌ను అందజేయనున్నారు. కోర్సులవారీగా అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థులు బంగారు పతకాలను అందుకోనున్నారు.

కనకరత్నమాలకు డాక్టరేట్

డాక్టరేట్ అందుకుంటున్న కనకరత్నమాల

ప్రజాశక్తి - ఆచంట

భీమలాపురం గ్రామానికి చెందిన శ్రీదేవి ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు, నరసాపురం బిజిబిఎస్ ఉమెన్స్ కాలేజ్ మేనేజింగ్ డైరెక్టర్ కొత్త కనకరత్నమాల వెంకటేశ్వర్లును గోబుల్ అకాడమీ కౌన్సిలర్, జర్మనీ యూనివర్సిటీ సామాజిక సేవ సోషల్ సర్వీస్‌లో భాగంగా రెండో సారి డాక్టరేట్ వరించింది. మద్రాస్ పాండిచ్చేరిలో యూనివర్సిటీ లా ఛైర్మన్, ఇండియన్ ఆర్మీ కెప్టెన్, రిటైర్డ్ డాక్టర్ సుబ్బయ్య, వైస్ ఛైర్మన్ గోపీకన్నన్, యూనివర్సిటీ డైరెక్టర్ సురేష్ బాబు, వైస్ ఛాన్సలర్ కిమ్ గోపి, నామినేషన్స్ డైరెక్టర్ మహమ్మద్ రఫీ, కన్నడ సినీ డైరెక్టర్ అశ్విన్ చేతుల మీదుగా ఈ అవార్డు అందు కున్నట్లు ఆమె శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఆమె 1983 సంవత్సరం నుంచి ఇప్పటివరకూ స్త్రీ శిశుసంక్షేమ, గ్రామీణాభివృద్ధికి పాటుపడుతున్న వారిలో సోషల్ అవేర్నెస్ కలగజేస్తూ సుమారు 500 మందికి రాష్ట్రస్థాయిలో ఉచితంగా వృత్తి శిక్షణలో కోర్సులు నేర్పించి, ప్రతి మహిళకూ చిన్నతనంలోనే తన తల్లిదండ్రులపై ఆధారపడకుండా ఆర్థికంగా నిలబడేలా, గ్రైండర్లు, మిక్సీలతో పాటు వెయ్యి 1000 కుట్టుమిషన్లు అందించినట్లు ఆమె తెలిపారు.

అన్ని గ్రామాలనూ ఆదర్శంగా తీర్చిదిద్దాలి : లక్ష్మీనారాయణ

మాట్లాడుతున్న జెడి లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మండలంలోని వెంప గ్రామంలో సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ శుక్రవారం పర్యటించారు. ముందుగా పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం కనక ముత్యాల అమ్మవారిని దర్శించుకున్నారు. తరువాత వెంప సొసైటీ ఏర్పాటు చేసిన సూపర్ మార్కెట్‌ను, సొసైటీని, సచివాలయాన్ని ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో కొన్ని గ్రామాలు మాత్రమే ఆదర్శ గ్రామాలుగా ఎంపికవుతున్నాయని వెల్లడించారు. అయితే ప్రతి గ్రామమూ ఆదర్శ గ్రామంగా ఉండాలని, తాను కోరుకుంటూ ముంబై యూనివర్సిటీలో పిహెచ్‌డి చేస్తున్నానని తెలిపారు. ఈ నేపథ్యంలో అటు తెలంగాణ, ఇటు ఆంధ్రప్రదేశ్‌లో ఎంపికైన ఆదర్శ గ్రామాల్లో కొన్ని సందర్శించి అక్కడ పరిస్థితులను తెలుసుకుని వాటిపై నివేదికను తయారుచేసి ముంబై యూనివర్సిటీ కి, ప్రభుత్వాలకు పంపడం జరుగుతుందని అన్నారు. భీమవరం మండలంలోని వెంప, చిన అమిరం, కాళ్ల మండలంలోని, పాతాళమెరక, కృష్ణా జిల్లాలో తాడినాడ గ్రామాలను సందర్శించి అక్కడి ప్రజల ద్వారా వివరాలు సేకరించి నివేదిక తయారు చేస్తానని పేర్కొన్నారు.

నేడు స్వాతంత్ర దినోత్సవ ముగింపు వేడుకలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఈనెల 17వ తేదీన భీమవరం క్విట్ ఇండియా స్థూపం వద్ద 78వ స్వాతంత్ర దినోత్సవ ముగింపు వేడుకలను నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ కన్వీనర్ చెరుకువాడ రంగసాయి అన్నారు. శుక్రవారం ఈ ముగింపు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ నాగరాణి, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు హాజరుకానున్నారని, క్విట్ ఇండియా అమరవీరులకు నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను సత్కరిస్తామని అన్నారు. ఎన్‌సిసి క్యాడెట్లకు, వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందిస్తామని తెలిపారు.


ఎంపిడిఒను అభినందిస్తున్న కార్యాలయ సిబ్బంది

ఎంపిడిఒగా వెంకటేశ్వరరావు నియామకం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

2024 సార్వత్రిక ఎన్నికల బదిలీలలో భాగంగా పాలకొల్లు నుంచి తూర్పుగోదావరి జిల్లా ఆత్రేయపురం మండలమునకు బదిలీపై వెళ్లిన సంఘాని వెంకటేశ్వరరావు ఎన్నికల అనంతరం తిరిగి పాలకొల్లు ఎంపిడిఒగా నియమితులయ్యారు. వారికి ఈ సందర్భంగా కార్యాలయ ఎఒ కె.గోవింద రాజులు, ఇఒపిఆర్‌డి కెఎం.వైభావతి, పంచాయతీ కార్యదర్శులు, ఆఫీసు సిబ్బంది ఆహ్వానం పలికారు. పుష్పగుచ్ఛలతో అభినందనలు తెలిపారు.

నేడు పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - పెనుగొండ

మండల పరిధిలో గల పెనుగొండ, వడలి, కొట్టాలపర్రు, సోమరాజుచేరువు గ్రామాలకు ఈనెల 17న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సబ్‌స్టేషన్ మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఎగ్జిక్యూటివ్ ఇంటనీర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.

తాడేపల్లిగూడెం : 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ పాతురు పరిధిలో 11 కెవి ఫీడర్‌కు మరమ్మత్తులు నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. పిఅండ్‌టి కాలనీ, వివేకానంద బొమ్మ, డిఎస్ చెరువు, 3వ వాటర్ ట్యాంక్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడున్నారు. కావున పట్టణ వినియోగదారులు సహకరించాల్సిందిగా తెలిపారు.

ఉనుదుర్రులో 'బేటి బచావో బేటి పడావో'

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని ఉనుదుర్రు గ్రామంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ వి.నిర్మల ఆధ్వర్యా 'బేటి బచావో బేటి పడావో' కార్యక్రమం నిర్వహించారు. బాలికలకు చదువు చాలా ముఖ్యమని, చిన్నారులను అంగన్వాడీ సెంటర్లకు పంపాలని నిర్మల తెలియజేశారు. నాలుగు సంవత్సరాలలోపు పిల్లలను అంగన్వాడీ పంపిస్తే ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. ప్రభుత్వం నుంచి చిన్నారులకు అందించే పోషకమైన ఆహారంతో పాటు క్రమశిక్షణ నేర్పిస్తారన్నారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ టీచర్, హెల్పర్ ఉంటారని పిల్లలను జాగ్రత్తగా చూసుకుంటారని, ప్రతి ఒక్కరూ చిన్న పిల్లలను తమ దగ్గరలో ఉన్న అంగన్వాడీకి పంపించాలని ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ బి.రత్నకుమారి, ఎఎన్ఎం వై.సంధ్యారాణి పాల్గొన్నారు.

మెగాస్టార్ జన్మదిన వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - నరసాపురం

పద్మవిభూషణ్, మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వారోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. నరసాపురం మండలం చిట్టవరం గ్రామంలో అంజనా పుత్ర చిరంజీవి యువసేన ఆధ్వర్యంలో మదన గోపాల స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిరంజీవి ఆయురారోగ్యాలతో వెలుగొందాలని, అనేక మంచి చిత్రాలలో నటించాలని కోరుకున్నారు. పుట్టినరోజుని పురస్కరించుకుని నియోజకవర్గంలో పలు గ్రామాలలో ఆగస్టు 16 నుంచి 22 వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నరసాపురం నియోజకవర్గ చిరంజీవి యువత అధ్యక్షులు పోలిశెట్టి సత్తిబాబు(అంజనా సత్తిబాబు) తెలిపారు. విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, మొక్కలు నాటుట, అన్నదానం, రక్తదానం, ఉచిత వైద్య శిబిరాలు, ఫ్రూట్స్, స్వీట్స్ పంపిణీ, కేక్ కటింగ్ మొదలగు కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువసేన అధ్యక్షుడు పోలిశెట్టి బాబి, మండల అధ్యక్షుడు అడ్డాల బాబి, కోపల్లి శ్రీనివాస్, గ్రంధి శ్రీనివాస్, కొప్పిరెడ్డి హరిబాబు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసి వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు అని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. ప్రత్యక్షంగా గాని, సామాజిక మాధ్యమాల ద్వారా గాని శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానని పేర్కొన్నారు. గత వారం రోజులుగా బొలిశెట్టి పుట్టినరోజు వారోత్సవాల పేరిట సేవా కార్యక్రమాలు, అన్నదానం, మెడికల్ క్యాంప్ నిర్వహించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

డ్రెయిన్ సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కాళీపట్నం తూర్పులో డ్రెయిన్ సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామంలో 216 జాతీయ రహదారికి ఇరువైపులా నిర్మించిన సీసీ డ్రెయిన్లలో మురుగునీరు బయటికి వెళ్లే మార్గం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ నాగరాణికి గ్రామస్తులు వినతిపత్రం అందించారు. సమస్య పరిష్కరించాలని కలెక్టర్ తహశీల్దార్ సిహెచ్.విద్యావతిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం గ్రామస్తులతో సమావేశం అయ్యారు. ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్ఐ ఎం.నిరంజన్, విఆర్ఒ డేవిడ్, మేడిది బాబ్జి, మారిపోయిన పెదకాపు కౌరు నాగరాజు, రంగశెట్టి అర్జున్, పేపకాయల జయరాజు ఉన్నారు.

వయోవృద్ధుల సమస్యలు పరిష్కరించాలి

సీనియర్ సిటిజన్స్ సంఘం ఆధ్వర్యాన ర్యాలీ

ప్రజాశక్తి - పెనుమంట్ర

చట్టాలుచేసి మరీ వృద్ధుల సంక్షేమం గురించి తగిన చర్యలు తీసుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉదాసీన వైఖరి తగదని పలువురు వృద్ధులు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం మార్టేరు గ్రామంలో మండల సీనియర్ సిటిజన్స్ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అనంతరం వారంతా నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. కేంద్రం, రాష్ట్రం 2007లో ఒకసారి, 2011లో ఒకసారి వయోవృద్ధుల సంక్షేమం కోసం చట్టాలు చేశాయని, అయితే అవి ఇప్పటికి అమలుకు నోచుకోకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు సంఘం అధ్యక్షులు పడాల జగన్నాధ రెడ్డి అన్నారు. ఈ ర్యాలీకి స్థానిక నాయకులు కొత్త సత్యనారాయణ మూర్తి, చిర్ల నరసింహా రెడ్డి నాయకత్వం వహించారు.

ర్యాలీ నిర్వహిస్తున్న వయోవృద్ధులు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

శిథిలావస్థలో ఎస్‌సి బాలికల వసతిగృహం

పట్టించుకోని ప్రభుత్వాధికారులు
కూలిపోయిన మరుగుదొడ్లు
ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని కాలం
గడుపుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం వేలంపేట వద్ద ఉన్న ఎస్‌సి బాలికల హాస్టల్ శిథిలావస్థకు చేరి కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ ప్రభుత్వ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. 1988లో టిడిపి ప్రభుత్వ హయాంలో లఘు పరిశ్రమల మంత్రిగా ఉన్న కలిదిండి రామచంద్రరాజు జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్ర నారాయణస్వామి, అత్తిలి ఎంఎల్‌ఎగా ఉన్న వికెడివి సత్యనారాయణ రాజు ఈ హాస్టల్‌ను ప్రారంభించారు. హాస్టల్‌లో బాలికలు ఉండడానికి రెండు గదులు ఏర్పాటు చేసి, అదేవిధంగా హాస్టల్ వార్డెన్‌కి కూడా ఉండడానికి వసతి ఏర్పాటు చేశారు. హాస్టల్ ప్రారంభం నాటికి 100 మంది బాలికలు ఉండేవారు. అయితే కాలక్రమేనా హాస్టల్‌కి మరమ్మతులు చేయకపోవడం వల్ల హాస్టల్ గదులు శిథిలావస్థకు చేరి పైస్లాబ్ ఊడిపడిపోవడంతో వర్షం వస్తే గదుల నిండా వర్షంనీరు చేరడం వల్ల బాలికలు గదుల్లో ఉండలేని పరిస్థితి ఏర్పడింది. దీంతోపాటు పిల్లల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్ల గోడలు కూలిపోవడం వల్ల బాలికలు స్నానాలు చేయడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భవనం శిథిలావస్థకు చేరడం వల్ల హాస్టల్‌లో కొత్తగా బాలికలు చేరడానికి ఆసక్తి చూపించకపోవడంతో హాస్టల్‌లో 33 ఉంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ప్రస్తుతం కలిగొట్ల, భీమవరం, తాడేపల్లిగూడెం, పిప్పర, పెద్ద నిండ్రకొలను, ఎల్లిమెల్లి, కైకలూరు ప్రాంతాలకు చెందిన విద్యార్థినీలు హాస్టల్‌లో ఉంటున్నారు. ప్రభుత్వ అధికారులు హాస్టల్‌ని చూసి, నివేదికలు తయారుచేసి తీసుకెళ్లడం తప్ప నిధులు కేటాయించి నూతన భవనం నిర్మాణానికి శ్రీకారం చుట్టిన పరిస్థితి కనబడలేదు.

ఈ విషయంపై ప్రజాశక్తి హాస్టల్ వార్డెన్ కె.సూర్యకళను వివరణ కోరగా హాస్టల్‌లో ఉన్న 12 గదులకి నాలుగు గదులు మాత్రమే బాగున్నాయని చెప్పారు. మిగిలిన గదుల్లో పై స్లాబ్ అచ్చులు జారిపోయి వర్షం నీరు పడడం వల్ల బాలికలు గదుల్లో ఉండలేకపోతున్నారని తెలిపారు. భవనం పరిస్థితిపై మండల పరిషత్ అధికారులకి పలుమార్లు చెప్పినప్పటికీ ప్రయోజనం కనపడలేదని అన్నారు. హాస్టల్లో ఉన్న విద్యార్థినులకు ప్రభుత్వం ఇవ్వాల్సిన కాస్మోటిక్స్ ఇవ్వడం లేదని, తమకు ఆరు నెలల బిల్లులు రావాలని అన్నారు. ఇటీవలే సాంఘిక సంక్షేమం వెల్ఫేర్ అధికారి హాస్టల్ పరిస్థితిపై నివేదిక రాసుకుని వెళ్లారని తెలిపారు. బాలికల స్నానాలకు, ఇతర అవసరాలకు హాస్టల్ పక్కన ఉన్న జిల్లా పరిషత్ హై స్కూల్‌లోకి తీసుకు వెళుతున్నామని అన్నారు. హాస్టల్‌కి కొత్త భవనం నిర్మిస్తే 100 మందికిపైగా బాలికలు చేరే అవకాశం ఉందన్నారు. హాస్టల్‌లో చేరడానికి వస్తున్న బాలికల తల్లిదండ్రులు భవనాన్ని చూసి ఆందోళన పడి, వారి పిల్లల్ని హాస్టల్‌లో జాయిన్ చేయకుండా వెనక్కి తీసుకెళ్లి పోతున్నారని అన్నారు. ఇప్పటికైనా కొత్తగా ఎన్నికైన కూటమి ప్రభుత్వం సాంఘిక సంక్షేమ హాస్టల్‌పై దృష్టి పెట్టి బాలికల హాస్టల్‌కు కొత్త భవనం నిర్మాణం చేస్తే అధిక సంఖ్యలో బాలికలు చేరే అవకాశం ఉంటుంది.

గణపవరం ఎస్‌సి హాస్టల్

గోడలు కూలిపోయిన మరుగుదొడ్లు

స్లాబ్ అచ్చులు ఊడిపోయిన గదులు

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేత

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రతిభావంతులను ప్రోత్సహిస్తే విద్యలో మరింత రాణిస్తారని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. శుక్రవారం భీమవరం మండలం తుందుర్రు జెడ్‌పి హైస్కూల్ వ్యవస్థాపకులు, మాజీ సర్పంచి ఆరేటి వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు తుందుర్రు గ్రామ సర్పంచి ఆరేటి వెంకటసత్య వీర స్వామినాయుడు(పెద్దబ్బులు), కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో పదోతరగతి(2023-2024)లో మొదటి మూడుస్థానాలు సాధించిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను ఎంఎల్ఎ అంజిబాబు చేతుల మీదుగా అందించారు. అనంతరం పదో తరగతిలో మొదటి స్థానం సాధించిన బెల్లపు భార్గవికి రూ.10 వేలు, బెల్లపు ఒజస్వికి రూ.6 వేలు, అడ్డాల రామ్ చరణ్ తేజకి రూ.4 వేలు చొప్పున మొత్తం రూ.20 వేలు అందించారు. కార్యక్రమంలో సర్పంచి ఆరేటి వెంకటసత్య వీర స్వామి నాయుడు(పెద్దబ్బులు), ఆరేటి కాశీ, మెంటే నాగేశ్వర్రావు, కోయ రాంబాబు, కమ్మిల రాము, యర్రంశెట్టి అప్పారావు, ఆరేటి ప్రదీప్, కిషోర్, జితేంద్ర, హెచ్ఎంలు కెఎస్‌సి హెచ్.సాయిరామ్, జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉండి : విద్యార్థికి పురస్కారం అందజేస్తున్న కలెక్టర్, మంత్రి


భీమవరం టౌన్ : విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న ఎంఎల్ఎ

నరసాపురం: స్వాతంత్ర దినోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ గ్రంథాలయ అధికారిగా అవార్డును కెజెఎస్ఎల్.కుమారి అందుకున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శేఖర్ బాబు, జిల్లా కేంద్ర గ్రంథాలయం డిప్యూటీ లైబ్రేరియన్ నారాయణ, కేంద్ర గ్రంథాలయ ఉద్యోగులు, కంప్యూటర్ ఆపరేటర్ కరుణాకర్, జూనియర్ అసిస్టెంట్ శ్యామ్‌బాబు, అపర్ణ కుమార్, అస్లాం, సందీప్, రమేష్ తదితరులు సూర్యంబాబు, ప్రిన్స్ ప్రవీణ్, జీవన్ కుమార్, ప్రసన్నకుమార్, సుధాకర్ ఈ కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కుమారి అంకితభావంతో, చిత్తశుద్ధితో అందరి మన్ననలు పొందుతూ సేవలందిస్తున్నారని గ్రంథాలయ కమిటీ త్రినాధ్, దవేజీ, సుధీర్ మోహన్, సుబ్బారావు, లయన్స్ క్లబ్ వారు, రోటరీ క్లబ్ వారు, గ్రంథాలయ పాఠకులు, సమ్మర్ క్యాంపు విద్యార్థుల తల్లిదండ్రులు, రిసోర్స్ పర్సన్స్, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు పలువురు అభినందించారు.

ఉండి: జిల్లా స్థాయిలో నిర్వహించిన బయో డైవర్సిటీ వక్తృత్వ పోటీల్లో చెరుకువాడ హైస్కూల్ విద్యార్థి డి.మోషే కరణ్ ప్రథమ స్థానం సాధించాడు. గురువారం భీమవరంలో జిల్లా కలెక్టర్ నాగరాణి చేతుల మీదుగా ప్రతిభా పురస్కారం అందుకోవటం అభినందనీయమని అర్థమూరు, కలిసిపూడి ఎంపిటిసి దంగేటి రామలింగేశ్వర రావు అన్నారు. కలిసిపూడికి చెందిన మోషే గ్రామానికి చక్కటి పేరు తెచ్చాడన్నారు. ఈ విద్యార్థికి ప్రత్యేక తర్ఫీదు ఇచ్చిన సుకుమార్ మాస్టారును రామలింగేశ్వర రావు శుక్రవారం అభినందించారు.

స్థూపం స్థలం బాగు చేయించాలని వినతి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఈనెల 17న శ్రీవిజ్ఞాన వేదిక, జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో భీమవరం తాలూకా ఆఫీసులోని క్విట్ ఇండియా స్థూపం వద్ద క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా అమరులకు నివాళుల కార్యక్రమం నిర్వహించుచున్నామని కన్వీనర్ చెరుకువాడ రంగసాయి తెలిపారు. గత 15 రోజులుగా భీమవరం నియోజకవర్గ పరిధిలో భీమవరంతోపాటు 16 గ్రామాలలో స్వాతంత్ర దినోత్సవ వేడులను పక్షోత్సవాలుగా నిర్వహించామని కన్వీనర్ చెరుకువాడ రంగసాయి శుక్రవారం తెలిపారు. 1942 ఆగస్టు 17వ తేదీన మహాత్మాగాంధీ పిలుపు మేరకు భీమవరంలో క్విట్ ఇండియా మహోద్యమం ఉధృతంగా జరిగిందని, సమరయోధులు భూపతిరాజు సుబ్బ తాతరాజు నాయకత్వంలో ఆనాడే స్వాతంత్రం వచ్చినట్లు జెండా ఎగురవేయడంతో బ్రిటిష్ వారు జరిపిన దమన కాండలో నలుగురు యోధులు వేగేశ్న నారాయణరాజు, గొట్టుముక్కల బలరామరాజు, ఉద్దరాజు వెంకట్రాజు, ముంతా బ్రహ్మాలు అసువులు బాసారని, అప్పటినుండి ఆగస్టు 17న వారికి నివాళులర్పిస్తూ సమరయోధుల కుటుంబీకులకు సత్కారాలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి క్యాడెట్స్‌కు ప్రశంసాపత్రాలు, విజేతలైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందిస్తున్నామని అన్నారు. అనంతరం స్థూపం వద్ద తమకు అందించిన స్థలంను బాగు చేయించాలని జిల్లా కలెక్టర్ నాగరాణికి వినతిని అందజేశారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపిడిఒ, వైద్యులు

నులిపురుగుల నిర్మూలనా కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరణ

పాలకొల్లు రూరల్: పాలకొల్లు ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఎంపిడిఒ సంఘాని వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణా కార్యక్రమంలో జాతీయ నులిపురుగుల నిర్మూలనా కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల హైస్కూలు, ఎలిమెంటరీ స్కూలు, కళాశాలలో, అంగన్వాడీ సెంటర్లలో 1 నుంచి 19 సంవత్సరాలలోపు వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయడం జరుగుతుందని డాక్టర్ ప్రతాప్ కుమార్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ శర్మ, ఈఇఒపిఆర్‌డి వై.భవతి, ఎఒ గోవిందరాజులు నాయుడు, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పిహెచ్ఎన్ పి ఎలిజిబెత్, సూపర్వైజర్లు డి.కమల, ఎస్‌కె.అమలేశ్వరరావు పాల్గొన్నారు.

అనుమతి లేని నిర్మాణాలపై చర్యలు

నరసాపురం: పట్టణంలో అనుమతులు లేని నిర్మాణాలపై చట్టప్రకారం చర్యలు తప్పవని పురపాలకసంఘ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అనుమతిలేకుండా భవనాలు నిర్మించిన యజమానులకు న్యాయస్థానం శుక్రవారం రూ.2,81,975లు అపరాధ రుసుము విధించింది. దీనికి సంబంధించి పురపాలక కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపిన సమాచారం మేరకు అనధికారకంగా భవనాలు నిర్మించిన 16వ వార్డుకు చెందిన అయినవల్లి వెంకటసత్యనారాయణకు రూ.1,28,955లు, 17వ వార్డుకు చెందిన జోగి నాగేంద్రరావుకు రూ.69,600లు, 9వ వార్డుకు చెందిన రుద్రరాజు సూర్యనారాయణరాజుకు రూ.83,420లు అపరాధ రుసుము విధిస్తూ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి తీర్పు వెల్లడించారన్నారు. బాధ్యులు అపరాధ రుసుము చెల్లించారని కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. అనధికార, అనుమతి పొందిన ప్లానులకు వ్యతిరేకంగా భవన నిర్మాణాలు చేస్తే చర్యలు తప్పవన్నారు. అనుమతిలేని వేళవుట్లలో మౌళిక వసతులు కల్పించడం కుదరదన్నారు. అటువంటి లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేసిన వారికి ఇబ్బందులు తప్పవన్నారు.

దాతల సహకారం అభినందనీయం

హెచ్ఎం నరసింహమూర్తి

ప్రజాశక్తి - మొగల్తూరు

పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న దాతలు అభినందనీయులని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగా నరసింహమూర్తి అన్నారు. మండలంలోని కెపిపాలెంలో ఉన్న హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం శుక్రవారం నిర్వహించారు. మనలోని మనిషి సొసైటీ ఇండియా సహకారంతో నిర్మల్ మేళం యంగ్ మైండ్స్ మిషన్ ఫౌండేషన్(యుఎస్ఎ) ఆధ్వర్యంలో పాఠశాలకు సుమారు రూ.4 లక్షల విలువ గల 5 కెవి సోలార్ ప్రాజెక్ట్‌ని పూర్వపు విద్యార్థి మేళం రంగారావు కుమారుడు మేళం కుమార్(యుఎస్ఎ) అందించి ప్రారంభించారు. దవేజీస్ మెరిట్ అవార్డు విద్యార్థులకు అందించేందుకు పాఠశాల పూర్వపు విద్యార్థి అయిన రాజేంద్ర దవేజి చక్రావధానుల(విశ్రాంత శాస్త్రవేత్త) పాఠశాల బ్యాంక్ అకౌంట్‌కి రూ.1,60 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. దీనిపై ప్రతి సంవత్సరం వచ్చే ఇంట్రెస్ట్ రూ.10 వేలును ఆయన తల్లిదండ్రులైన కీర్తిశేషులు సత్యనారాయణ దవేజి, లక్ష్మీ సోదమ్మ దంపతుల జ్ఞాపకార్థం పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి మెరిట్ ప్రైజ్‌గా అందిస్తామని, దీనిని ఈ సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నానని తెలిపారు. దాత దవేజీ పాఠశాలకు రూ.20 వేలతో సౌండ్ సిస్టం అందించాలని ఆయన తెలిపారు. గ్రామనికి చెందిన మేళం సూర్యప్రకాష్ రావు పాఠశాల విద్యార్థులకు సైకిల్ షెడ్‌ను ఈ విద్యా సంవత్సరంలోనే నిర్మిస్తానని హామీ ఇచ్చారు. గ్రామానికి చెందిన ఎ1 కాంట్రాక్టర్ అందే కాశీ విశ్వేశ్వరరావు ప్రతి సంవత్సరం ఐదుగురు పేద విద్యార్థులను దత్తత తీసుకొని ఇంటర్మీడియట్ స్థాయి నుంచి ఇంజనీరింగ్, మెడిసిన్ వరకు తన ఖర్చుతో చదివిస్తానని హామీ ఇచ్చారని అన్నారు. ఈ విద్యా సంవత్సరంలో నలుగురు విద్యార్థులను దత్తత తీసుకొని చదివిస్తున్నారని తెలిపారు. దాతలు సవాకుల పాండురంగారావు, సత్తినేని త్రినాథ్‌లు ప్రతి సంవత్సరం ప్రతిభ చూపించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందించనున్నారు. ఇంటర్మీడియట్ చదివే కళాశాల విద్యార్థినిలకు సుమారు రూ.25 వేలతో ఒక్కొక్కరికి రెండు ఏకరూపు దుస్తులను పూర్వపు విద్యార్థులు అయిన బెల్లంకొండ నాని, పింగళి గిరిజా మనోహర్ శర్మ, పి.కళ్యాణి(బొంబే), మోషే, పేరుపాలెం వెంకన్నలు రూ.5 వేలు చొప్పున అందించారన్నారు. 2003-2004 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాల గ్రౌండ్‌లో రన్నింగ్ ట్రాక్‌ను నిర్మించనున్నారని హెచ్ఎం తెలిపారు. ఈ సమావేశంలో మండల లయన్స్ క్లబ్ సభ్యులు పిఎస్‌వి.సుబ్బారావు, కోట్ల నాగేశ్వరరావు, చింతపల్లి కృష్ణమోహన్ ఉన్నారు.


దాతను సత్కరిస్తున్న పాఠశాల సిబ్బంది, విద్యా కమిటీ సభ్యులు

అంగన్వాడీ చిన్నారులపై అలసత్వం వద్దు

ఎంపిపి సూర్యకుమారి, సర్పంచి మాధవరావు

ప్రజాశక్తి - ఆచంట

అంగన్వాడీ చిన్నారులపై అలసత్వం వహించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి అన్నారు. శుక్రవారం భీమలాపురం గ్రామంలో ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, సర్పంచి గుబ్బల మాధవరావులు గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ఐసిడిఎస్ ప్రాజెక్టు కోడ్ నెం.116 అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారంతో పాటు పాలు, గుడ్లు, సమయానికి అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. పిల్లలతో సహా కూర్చుని వారు తినే ఆహారం ఎలా ఉందని అడిగి తెలుసుకుని, పిల్లలతో సరదాగా కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా హాజరు పట్టిక, స్టాక్ వివరాలు తనిఖీ చేశారు. చిన్నారులకు సమయానికి ఆహారాన్ని అందించాలని, నేటి బాలలే రేపటి పౌరులు కాబట్టి వారి విషయంలో ఎటువంటి లోటుపాట్లకు తావివ్వకుండా మంచి పౌష్టికాహారాన్ని అందించి, ఆరోగ్యవంతమైన పిల్లలుగా తీర్చిదిద్దాలని, పిల్లల విషయంలో అలసత్వం వహిస్తే సహించబోమని ఆమె హెచ్చరించారు. మండలంలో ఉన్న అన్ని అంగన్వాడీ కేంద్రాలను అకస్మికంగా వారంలో ఒక్కసారైనా విజిట్ చేస్తానని, మీ విధులు మీరు సక్రమంగా నిర్వహించుకోవాలంటూ అంగన్వాడీ కార్యకర్తలకు హితబోధ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల చైర్మన్ కౌరు త్రిమూర్తులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాటక రంగానికి రంగరాజు సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి - ఉండి

అంతంత మాత్రంగా కొనసాగుతున్న నాటక రంగానికి రంగరాజు చేసిన పరిశోధన కొత్త ఊపిరి పోస్తుందని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం ఉండి మండలం చెరుకువాడలో డాక్టరేట్ పొందిన డాక్టర్ గాదిరాజు రంగరాజును పలువురు సత్కరించారు. సభకు గ్రామ సర్పంచి కొండవీటి సాంబశివరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపిపి ఇందుకూరి హరిబాబు మాట్లాడుతూ జిల్లా నాటక రంగం మీద తొలి పరిశోధన కావటం మన జిల్లాకే గర్వకారణం అన్నారు. చక్కటి పరిశోధన చేసిన రంగరాజు అభినందనీయుడు అని తెలిపారు. గ్రామ సర్పంచి సాంబశివరావు మాట్లాడుతూ బహుముఖ ప్రజ్ఞాశీలి రంగరాజు మాస్టారు అని కొనియాడారు.

జనవాణి అర్జీల స్వీకరణ కొనసాగింపు

ప్రజాశక్తి - ఆకివీడు

జనసేన రాష్ట్ర కార్యాలయంలో ప్రజల నుంచి స్వీకరించే వినతుల కార్యక్రమం 'జనవాణి' ఇకనుంచి సోమవారం నుంచి శుక్రవారం వరకూ కొనసాగుతుందని జనసేన అధ్యక్షులు, రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్ పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకూ ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని తెలిపారు. నిత్యం వందల సంఖ్యలో అర్జీలు వస్తున్నాయని, వాటిని సంబంధిత శాఖలకు పంపేందుకు సమయం అవసరమైన దృష్ట్యా ఈ మార్పులు చోటుచేసుకుంటున్నట్లు వెల్లడించారు.

ఉండి ఎస్ఐగా నజీర్

ఉండి: ఉండి పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐగా మహమ్మద్ నజీరుల్లా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహచర సిబ్బంది సహకారంతో మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతలు నెలకొల్పేందుకు కృషిచేస్తానని అన్నారు. గతంలో ఎసిబిలో పనిచేసిన నజీరుల్లా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత జరిగిన బదిలీల్లో భాగంగా ఉండి ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. గతంలో ఉండి ఎస్ఐగా పనిచేసిన మందపల్లి లక్ష్మణ్ ద్రాక్షారామం ఎస్ఐగా బదిలీలో భాగంగా వెళ్లారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా గణపవరం మండలం ముగ్గుళ్ల గ్రామ కాపురస్తులైన ఎలమంచిలి వెంకటలక్ష్మి భర్త వెంకన్న అను నేను నా యొక్క పాస్ పోర్ట్ గణపవరం SBI సెంటర్లో జిరాక్స్ తీయించుకుని మా గ్రామంకు వెళ్లే మార్గ మధ్యలో పాస్ పోర్ట్ నెంబర్ X1049505 పాస్ పోర్ట్ మరియు జిరాక్స్‌తో సహా కవర్లో పెట్టుకుని బండికి తగిలించి వెళ్లే మార్గ మధ్యలో ఎక్కడ పడిపోయిందో తెలియదు ఎంత వెతికిన దొరిక లేదు దొరికినవారు ఈ కింది నెంబర్ కు తెలియజేయగలరు .

ఎలమంచిలి వెంకటలక్ష్మి, భర్త వెంకన్న
ముగ్గుళ్ల గ్రామం, గణపవరం మండలం
పశ్చిమగోదావరి జిల్లా. సెల్ 9347747643

మహారాజశ్రీ భీమవరం 1st అడిషనల్ సివిల్ Judge (జూనియర్ డివిజన్) మరియు 1st క్లాసు మేజిస్ట్రేట్ వారి కోర్టులో
ఓ.ఎస్.55/2024, ఐ.ఎ.76/2024

వాది : ఇమ్మిడి సత్య సూర్య వెంకట నరసింహం.
ప్రతివాదులు : 1.కోపర్తి సూర్య కుమారి, D/o.వెంకటరాజు, డో.నెం.2-78, గొల్లవాని తిప్ప.
2.ఇమ్మిడి నాగ అంకిత్, S/o.I.S.S.V. నరిసింహం, వేణుగోపాల స్వామి టెంపుల్ వద్ద, భీమవరం.

Order 5 Rule 20 C.P.C.
ప్రకారం 1వ ప్రతివాదికి నోటీసు

పై నెంబర్ ఓ.ఎస్‌లో 1వ ప్రతివాదికు కోర్ట్ వారు ఎన్నిసార్లు సమన్లు పంపిన అమలు జరగనందున కోర్టు వారు దావాను ది.06.09.2024 తేదీకి వాయిదా వేసినారు. కావున 1వ ప్రతివాది పై తేదీన పైకోర్టు వారి ఎదుట ఉదయం 10 గం॥లకు హాజరై మీ సంజాయిషీ తెలుపుకోవలసినది గాను లేని పక్షంలో మీ పరోక్షంలో ఓ.ఎస్, ఐ.ఎ.లు తీర్మానం కాబడునని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

మోగంటి శివకృష్ణ
భీమవరం, వాది తరుపు లాయర్.
ది.17.08.2024 సెల్: 98485 39039

ప్రకటన
మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ వారి కోర్టులో
ఐ.పి.నెం.14/2024

Between:
ఒసూరి ఫణీంద్ర నరసింహా నాయుడు ...పిటిషనరు
వెర్సెస్
1.అయితం భారత్ సత్యగ్న మవుళ్ళయ్య అరుణ్
2.మేధం రత్న ధనలక్ష్మి హారికా
3.డి.అఫీషియల్ రిసీవర్, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు ...రెస్పాండెంట్లు టు

1వ రెస్పాండెంటు: అయితం భారత్ సత్యగ్న మవుళ్ళయ్య అరుణ్, S/o.కాశీ విశ్వేశ్వరరావు, పురుషుడు, వయస్సు 34, రెసిడెంటు ఆఫ్ ఫ్లాట్ నెం.301, 3వ ఫ్లోర్, జె.ఆర్.అపార్టుమెంట్సు, రాజేంద్ర లైన్స్‌క్లబ్ ఎదుట, బిహేండ్ స్విమింగ్‌పూల్, ఆకెళ్ళవారి వీధి, నరసాపురం-534 275. పశ్చిమ గోదావరి జిల్లా.

పై నెంబరు కేసులో పిటీషనరు పస్తు రెస్పాండెంటుని ఇన్‌సాల్వెంటుగా డిక్లేర్ చేయమని మరియు సెటిల్‌మెంటు డీడ్ తేది.20-1-2024 డాకుమెంటు నెం.404/24ని సెట్ ఎసైడ్ చేయమని పై కోర్టులో ఐ.పి.నెం.14/24 చేయడము జరిగినది. శ్రీకోర్టు వారు 19-08-2024 తేదీన కేసును వాయిదా వేయడము జరిగినది. ఈ ఆస్తిపైన ఎవరైన లావాదేవీలు జరిపిన యెడల అది చట్టప్రకారముగా చెల్లవని తెలియజేయడమైనది.

షెడ్యూలు

అయిటమ్ నెం.1: 38.81 Sq.Yards of 1/8 Undivided joint Right in 310.5 Square Yards.
తూర్పు : అల్లూరి పద్మరాజు గారి తూర్పు కాంపౌండ్ వాలు 40 పీట్
పడమర: మున్సిపల్ రోడ్డు,ఆకెళ్ళ వారి వీధి
ఉత్తరం : ముక్తవరపు గోపి గారి బిల్డింగ్
దక్షిణం : ద్వారా మల్లేశ్వరరావు గారి బిల్డింగ్
అయిటమ్ నెం.2 : 950 Sq.Yards of Plot No. 301.
తూర్పు : ప్లాట్ నెం.302 జె.ఆర్.రెసిడెన్సీ
పడమర: ఖాళీ స్థలం
ఉత్తరం : ఖాళీ స్థలం
సౌత్ : ఖాళీ స్థలం

సిహెచ్.యస్.ఆర్.ఆర్.యమ్.బాలాజీ
అడ్వకేటు, నర్సాపురం.